వన్ వే ట్రాఫిక్

"ఏమండీ తాతగారూ! ఐదున్నర అవుతున్నది. మధ్యాహ్నం వస్తానన్నారుగా? మరి త్వరగా బయలుదేరండి" అన్నాడు మధు గుమ్మంలో నుంచుని. అతడు తెల్లని ఫ్యాంటూ, షర్టూ ధరించి 'ట్రిమ్'గా తయారైవచ్చాడు.

అతని మాటలు విని, అరవైయేళ్ళ ముసలాయన, క్రింద చాప మీద కూర్చుని పాలు చల్లారుస్తున్న కోడలివంక చూశాడు. ఆమె తల పైకెత్తి కనుబొమ్మలు ముడిచి "ఎక్కడికో ప్రయాణం కట్టినట్టున్నారే. సినిమాకా ఏమిటి? నిన్న డాక్టరు ఏం చెప్పాడో గుర్తులేదూ? మీ వంటికి చలిగాలి అసలు తగలనేకూడదని చెప్పాడుగా!" అన్నది. ఆయన ఏమీ మాట్లాడలేదు. మధు మాటిమాటికీ రిస్టువాచీవంక చూసుకుంటూ తొందర పడుతున్నాడు. ఆయనకేమీ తోచలేదు. దీనంగా కోడలివంక చూసి, "కాదమ్మాయి. ఇవాళ మధ్యాహ్నం ఏవో మాటల సందర్భంలో మధు 'ఇవాళే కొత్త సినిమా విడుదల అయింది. నేను వెడదామనుకుంటున్నాను' అన్నాడు. 'మీరూ రాకూడదండీ తాతగారూ!' అని అడిగాడు కూడా. నేనేమో నువ్వు అడ్డుచెప్పవులే అని భరోసాతో 'సరేవస్తాన'ని అన్నాను" అన్నాడు. ఆమె పాలగ్లాసు మామగారికి అందిస్తూ "ఏమో! బాబూ! మీది అసలే గాజుకాయవంటి వళ్లు. పైగా పెద్దతనం. నాకసలు ఇష్టంలేదు" అన్నది. ఆయన ఏమీ మాట్లాడలేకపోయాడు. కొద్దికొద్దిగా పాలు చప్పరిస్తూ అలాగే కూర్చున్నాడు. ఆమె స్నానాల గదిలోవున్న భర్తకు తువ్వాలు యిచ్చేందుకు లోపలికి వెళ్ళింది. గుమ్మం అవతలి నుంచి మధు "తాతగారూ! త్వరగా కానివ్వాలి. అసలే టిక్కెట్లు దొరకవేమోనని అనుమానంగా వుంది. మీరు ఆలస్యంచేస్తే ఏమీ లాభంలేదు. బుక్కింగు కట్టేస్తారు" అంటున్నాడు.

ముసలాయన పాలగ్లాసు క్రిందపెట్టి తల పైకెత్తేసరికి మొహం తుడుచుకుంటూ కొడుకు లోపలి గదిలోనుంచి హాల్లోకి వచ్చాడు. ఆయన నెమ్మదిగా "ఒరే సారథీ" అని పిలిచాడు. అతడు పిలుపువిని "ఏం నాన్నా?" అంటూ దగ్గరికి రాగానే నెమ్మదిగా "మన ఇల్లుగలవారి అబ్బాయి సినిమాకు వెడుతూ నన్నూ రమ్మన్నాడురా. నాకోసం వచ్చి ముందు గదిలో కాచుకునివున్నాడు. "అమ్మాయేమో 'వీల్లేద'ని అంటున్నది. నువ్వుకాస్త చెప్పిచూడరా. ఈ ఒక్కసారికే. ఇక ఎప్పుడూ అడగను" అన్నాడు.

సారథి నవ్వి, "మీరు మరీ పసిపిల్ల లవుతున్నారేం నాన్నా! ఏమీ ఫరవాలేదు, మీరు వెళ్ళండి. దానికి నేను చెబుతాన్లెండి" అన్నాడు. ముసలాయన ఉత్సాహంగా లేచి కళ్ళజోడు సవరించుకుని, చెప్పులు తొడుక్కుని, చేతికర్రకోసం వెదుకుతూవుండగా కోడలు ముందుగదిలోకి వచ్చింది. ఆమె అంతా అర్థంచేసుకుని, "అయితే నేను చెప్పినమాట వినరన్నమాట. వెళ్ళితీరవలసిందేనా?" అని అడిగింది. ముసలాయన ఆగిపోయాడు. సారథి నవ్వి, "పోనివ్వవే పాపం! ఎంత సరదా పడుతున్నారో! ఈ వొక్కసారికేలే" అన్నాడు. ఆమె భర్తకెదురు చెప్పలేక "సరేబాబూ! మీ యిష్టం. నా కెందుకు మధ్య నిష్ఠూరం" అంటూ చేతికర్ర వెదికి మామగారికి అందించింది.

ఆయన ఉత్సాహంగా నడుస్తూ, ముందుగదిలోకి వచ్చేసరికి మధు లేచి "అమ్మయ్య! వచ్చేశారా! యింత ఆలస్యం చేశారేం తాతగారూ? మనం త్వరగా నడవాలి. ఇప్పటికే టిక్కెట్లిస్తూవుంటారు. పైగా కొత్త సినిమా. జనం విపరీతంగావుంటారు కూడా" అంటూ నడవటం ప్రారంభించాడు. నడుస్తున్నంతసేపూ మధు కొత్తగా విడుదల అయిన ఆ సినిమా తీసినవారి గొప్పదనమూ, ఇంతకుముందు వారు తీసిన సినిమాలన్నీ వరుసగా రజతోత్సవాలు జరుపుకున్న వివరమూ, అందులో నటీనటుల గొప్పదనమూ వివరిస్తూనే వున్నాడు. ఒక సెంటరులోకి రాగానే ముసలాయన ఆగి మధును భుజంతట్టి ఆపి, "ఇంకా ఎంతదూరం ఆ హాలు?" అని అడిగాడు, ఆయాసంతో. మధు "ఇంకెంత దూరమండీ, వచ్చేశాం, మరో పది నిముషాలు నడిస్తే చాలు" అన్నాడు. ముసలాయన పై పంచతో మొహం తుడుచుకుంటూ, "నేనిక నడవలేను. రిక్షా ఒకటి మాట్లాడుకుందాం నాయానా?" అన్నాడు. మధు, "అదేమిటండీ? ఇక్కడినుంచి 'వన్ వే ట్రాఫిక్' రిక్షాలో అయితే ఎంతో చుట్టుతిరిగి పోవాలి. నడిచిపోతే అరమైలుకూడా లేదు" అన్నాడు. ముసలాయన "అయినాసరే. నేను నడవలేను బాబూ! అదుగో ఆ రిక్షాను పిలిచి మాట్లాడు" అన్నాడు. మధు వాచీవంక అనుమానంగా చూసి, తల పంకించి "ఆల్‌రైట్! అంత నడవలేనప్పుడేం చేస్తాం? మీ యిష్ట ప్రకారమే కానివ్వండి" అంటూ రిక్షాను పిలిచి 'ఎక్కండి' అన్నాడు.

రిక్షా నడుస్తున్నంతసేపూ మధు ఆదుర్దాగా వాచీ వంక చూసుకుంటూనే వున్నాడు. వుండి వుండి "ఏమోనండీ తాతగారూ! నాకు సినిమా అందుతుందనే నమ్మకం లేదు. మనం వెళ్ళేసరికి 'హౌస్‌ఫుల్' అని బోర్డు తగిలించి వుంటా రనుకుంటాను" అంటున్నాడు. అతని ఆదుర్దాచూస్తే ముసలాయనకు నవ్వు వచ్చింది.

సినిమాహాలు లైట్లతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నది. వారు రిక్షాలో నుంచి దిగేసరికి టిక్కెట్లు దొరకని జనం కొంతమంది ఇళ్ళకు తిరిగిపోతున్నారు. గేటు తలుపు మీద 'టిక్కెట్లు లేవు' అని బోర్డు తగిలించబడి వుంది. ముసలాయన మధును వారించి, రిక్షావాడికి తాను డబ్బులిచ్చి పంపాడు. మధు దీనంగా "చూశారా తాతగారూ! నే నప్పుడే అనుకున్నాను. ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదల అవుతుందా అని జనం ఎదురుచూస్తున్నారు. మనం కాస్త ముందుగా వచ్చివుండవలసింది. ఇప్పుడేమిటి చెయ్యడం?" అన్నాడు. ముసలాయన లైట్లవంకా, సినిమాహాలుముందున్న నిలువెత్తు బొమ్మలవంకా చూసి, కాస్సేపాగి "చూడు మధూ! ఇవాళ మా కోడలు చాలా కష్టంమీద వొప్పుకుంది. మళ్ళీ అన్నప్పుడల్లా నన్ను రానివ్వదు. కాబట్టి దగ్గర్లో, మరేదైనా సినిమా వుందేమో చూడు. మొదలు పెట్టినా ఫరవాలేదు" అన్నాడు.

మధు ఆలోచించి 'ఈ ప్రక్కనే ఈశ్వర్ టాకీసు వుంది. అక్కడ యిప్పు డే సినిమా ఆడుతున్నదో తెలియదు. ఆ హాల్లో ఎప్పుడూ యిరవై పాతికేళ్ళనాటి తుక్కు ఫిలుములు వేస్తూ వుంటారు. ప్రేక్షకులకోసం ఎదురుచూస్తూ వుంటారు. పదండిపోదాం" అంటూ దారి తీశాడు. ముసలాయన చేతిలో కఱ్ఱతో అతన్ని అనుసరించాడు.

వారిద్దరూ మరొక అయిదారు నిముషాలు నడిచి ఆ హాలు చేరుకున్నారు. హాలుపైన ఒక్క లైటు తప్ప మరేమీ అలంకరణలులేవు. అక్కడ కూడా సినిమా మొదలుపెట్టారు.

మధు టిక్కెట్లు తీసుకుంటూ "ఎంతసేపయింది ఆట ప్రారంభించి!" అని అడిగాడు. "అబ్బే ఎంత సేపో ఎక్కడండీ, అయిదు నిముషాలుకూడా కాలేదు" అన్నాడు.

ఇద్దరూ హాలు లోపలికివెళ్ళి కూర్చున్నారు. హాలులోపల పంకాలు కూడా ఆడటంలేదు. అన్ని తరగతుల ప్రేక్షకులూ కలిసి పాతిక మంది అయినా వుంటారో, లేదో! ముసలాయన రెండుమూడు నిముషాలు చూడగానే గంభీరంగా మారిపోయాడు. ఆయనకు గుర్తువచ్చింది. ఆ సినిమా ఇరవై అయిదు సంవత్సరాలనాటిది. అందులో కథానాయకుడి పాత్ర నిర్వహించింది తనే. తాను వేసిన నాలుగైదు సినిమాలలోను ఇందులో మాత్రమే ప్రముఖపాత్ర లభించింది. తను వేసిన మిగిలిన పాత్రలు చాలా చిన్నవి. ఇది ఒక జానపద సాహసిక గాథ. అందులో తానొక మామూలు సిపాయి. రాజకుమారిని ప్రేమిస్తాడు. రాజకుమారి కూడా తనను ప్రేమిస్తుంది. రాణికీ, రాజుకూ ఇది కంటకప్రాయంగా వుంటుంది. వారా సిపాయిని అనేక విధాలుగా హింసిస్తారు. రాణీగారు వెర్రివాడైన తన తమ్ముడికి రాజకుమారినిచ్చి పెళ్ళిచెయ్యాలని పట్టుదలతో వుంటుంది. ఇంతలో కథలో మరొక మాంత్రికుడు వస్తాడు. చివరకు కథానాయకుడు మాయలనూ, మంత్రాలనూ జయించి, మొసళ్ళతోనూ, పులులతోనూ పోరాడి మాంత్రికుణ్ణి చంపి ప్రేయసిని దక్కించుకుంటాడు. ఈ రోజులలో ఆ సినిమా విపరీతంగా ప్రజాదరణ పొంది లక్షలకొద్దీ లాభాన్ని తెచ్చి పెట్టింది. ఆ సినిమా తీసిన ఒకరెడ్డి ఇప్పుడేమయినాడో తెలియదు. ఇప్పుడది పాతబడిపోయి అక్కడక్కడ తెగిపోతున్నది. మాటలు సరిగా వినిపించటంలేదు. ఫిలుము కళాకాంతులు కోల్పోయి బాధగా నడుస్తున్నది. ముసలాయన సినిమా చూస్తూనే అంతా జ్ఞాపకం తెచ్చుకున్నాడు. రాజు రాణి పాత్రలను నిర్వహించిన వారిద్దరూ ఏమైపోయారో తనకు తెలియదు. రాజు పాత్ర ధరించినవాడు చాలా దురదృష్టవంతుడు. అతని ఇంటిచుట్టూ ఎప్పుడూ అప్పులవారు కాచుకుని వుండేవారు. సినిమాలో 'విలన్' వేసినవాడు తెరమీద ఎంత క్రూరంగా, భయంకరంగా నిర్దాక్షిణ్యంగా కనిపించేవాడో, నిజజీవితంలో అంతసాధుశీలి, దయార్ద్ర హృదయుడు, దాత. 'చదువుకుంటున్నాను బీదవాణ్ని' అనీ, 'జబ్బుగావుంది మందుకు డబ్బులేదనీ' 'ఇళ్లు కాలిపోయాయి, నిలువనీడలేదనీ' 'వరదాబాధితులం సాయం చెయ్యండి' అనీ ఎప్పుడూ ఎవరో ఒకరు అతని వెంట తిరుగుతూవుండేవారు. ఎవరినీ కాదనేవాడు కాదు. ఇచ్చే సమయంలో చేతి కెంతనోటు వచ్చేదీ గమనించేవాడుకాదు. అందువల్ల ఎంత డబ్బు సంపాయించినా అతడు ఆస్తిపరుడు కాలేకపోయాడు. సినిమా పరిశ్రమలో ఎక్కువ అనుభవం వున్నందువల్లను, చాల సినిమాలలో రకరకాల పాత్రలు నిర్వహించి నందువల్లనూ అతడు తర్వాత ఎక్కడో రైలు ప్రమాదంలో మరణించినప్పుడు పత్రికలలో చిన్న అక్షరాలతో అతని మరణవార్త అచ్చువేసి సంతాపం ప్రకటించారు. రాణిగారి తమ్ముడిది హాస్యపాత్ర. ఆ సినిమా కొత్తగా విడుదల అయిన రోజుల్లో ప్రేక్షకులను ఆ పాత్ర కడుపుబ్బ నవ్వించేది. ఆ వేషం వేసిన వాడు నిజజీవితంలో ఎప్పుడూ గంభీరంగా, నిరుత్సాహంగా, నీరసంగా వుండేవాడు. కదిలిస్తే వేదాంతం మాట్లాడేవాడు. అతడు తరువాత ఎప్పుడో "నా చావు కెవరూ బాధ్యులుకారు" అని ఉత్తరం వ్రాసి పెట్టి తన గదిలో దూలం నుంచి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజకుమారిగా నటించిన ప్రమీల అనే ఆమెకిప్పుడు

యాభైఏళ్ళువుంటాయి. ఆమె కిప్పుడు ఏడెనిమిదేళ్ళ మనవరాలుతప్ప మరెవరూలేరు. ఇంటి పెరటిలోవున్న కరివేపాకుచెట్టు ఆమెకు జీవనాధారం. ప్రతిరోజు సాయంకాలంపూట కరివేపాకు కోసి కట్టలుకట్టి ఉదయమే మనవరాలిచేత ఒక బుట్టతో ఇంటింటికి పంపేస్తుంది. వారు ఒక్కొక్క కట్ట తీసుకుని కాసిని బియ్యం ఆ బుట్టలో వేస్తారు. సినిమాలో తానుపాడిన ప్రేమ పాటలకు ప్లేబ్యాక్ పాడినవాడు యిప్పుడు భీమవరంలో వుంటున్నాడు. నాలుగేళ్ళ క్రిందట ఒకసారి ఏదో పనిమీద ఆ వూరు వెళ్ళినప్పుడు అతని యింటికి వెళ్ళాను. అతడప్పుడు గ్రామఫోనుమీద తాను పాతికయేళ్ళ క్రితం పాడిన పాటనే పెట్టుకుని వింటూ కూర్చునివున్నాడు. ఆ రికార్డు పూర్తిగా అరిగిపోయి అసహ్యంగా వినిపిస్తున్నది. తననుచూచి అతడు ఆదరించి మాట సందర్భంలో తన యింట్లో ఎవరికీ గ్రామఫోను అంటే యిష్టం లేదనీ, రేడియోవచ్చాక దాన్ని పూర్తిగా మూలపారేశారనీ, తానుమాత్రం మరెవరూ లేకుండాచూసి, అప్పుడప్పుడు ఇలా వింటూవుంటాననీ చెప్పాడు.

కథలో తనకూ, దొంగల నాయకుడికీ మధ్య ముష్టియుద్ధం జరుగుతున్నది. ఆ సన్నివేశంలో ముసలాయన రక్తం పరుగులెత్తింది. ఆయన ఆవేశంతో చేయివిసిరి, కుర్చీదెబ్బతగలగా 'అబ్బా' అనుకున్నాడు బాధగా. మధు ఆశ్చర్యపోయి "ఏమిటి తాతగారూ?" అని అడిగాడు. ముసలాయన, "అబ్బే, ఏమీలేదు" అన్నాడు. మధు కాస్సేపాగి "ఇవాళ పొద్దున్నే లేచి ఎవరిమోహం చూశామో, యీ తుక్కు సినిమాకు రావలసి వచ్చింది. అయినా ఏం సినిమాలండీ... ఆ పాత్రలూ, కథా అంతా అవాస్తవికంగా అసహజంగా వున్నాయి" అన్నాడు. ముసలాయనకు చాలా మనస్తాపం కలిగింది. ఆయన నెమ్మదిగా "నువ్వలా అనకోయ్! ఆ రోజుల్లో వాళ్ళుకూడా తమకున్న అవకాశంలో బాగానే సినిమాలు తీశారు"... అంటూవుండగా ఉన్నట్టుండి ఫిలిమ్ ఆగిపోయింది. లైట్లు ఒక్కసారి వెలిగి, మళ్ళీ ఆరిపోయాయి. కరెంటుపోయింది. ఉన్న కొద్దిమందిలోనూ ఎవడో ఈలవేశాడు. మధు లేచి బయటికి వెళ్ళాడు.

ముసలాయన అలాగే కూర్చున్నాడు. ఆయనకు దాదాపు పది రోజుల క్రిందట జరిగిన ఒక చిన్న విషయం గుర్తుకు వచ్చింది. ఆయన ఒకనాడు సాయంకాలం షికారువెళ్ళి తిరిగి వస్తూండగా ఒక వీధి చివర నలుగురైదుగురు పిల్లలు 'కర్రాబిళ్ళా' ఆడుతూ కనిపించారు. ఆయన కాస్సేపు ఆ ప్రక్కనే నిలబడి చూశాడు. ఆయనకు ఆ ఆటంతా జ్ఞాపకం వచ్చింది. చిన్నతనంలో పల్లెటూళ్ళో యీ ఆట ఆడుతూవుంటే పట్టుదలలు హెచ్చి అన్నమూ, నీళ్ళుకూడా మరిచిపోయేవారు. గొడ్లను కాచుకునే కుర్రవాళ్ళు ఆట ధ్యాసలోపడి గొడ్లెటుపోయేదీకూడా గమనించేవారుకాదు. ముఖ్యంగా ఆయన తన చిన్నతనంలో ఆ ఆటలో నిష్ణాతుడు. అతడు ఏ జట్టులో వుంటే ఆ జట్టు గెలవటం తథ్యం. అతడు చేతికొద్దీ వేసిన దెబ్బకు ఆ కర్రముక్క 'కుయ్యో'మని గోలచేస్తూ, గిరాగిరా తిరుగుతూ ఫర్లాంగులకొద్దీ ఎగిరిపోయేది. వాళ్ళ ఆటచూస్తూ అదంతా జ్ఞాపకం చేసుకున్న ముసలాయనకు చిత్రమైన కోరిక కలిగింది. ఒకసారి చుట్టూచూసి, దగ్గర్లో ఎవరూలేరని తెల్చుకుని, ఆ కుర్రాడిదగ్గరకు వెళ్ళి "ఒకసారి నేను ఆడతాను ఇస్తావా?" అని అడిగాడు. వాడు ఆశ్చర్యపోతూ, కొద్దిగా నవ్వుతూ ఆ ముసలాయనకు కర్రాబిళ్ళా ఇచ్చాడు. తనచేతిలో వున్న ఖరీదయిన చేతికర్రను ఆ కుర్రవాడి చేతికిచ్చి కర్రాబిళ్ళా అందుకున్నాడు.

పిల్లలందరూ ఆ ముసలాయనవంక చిత్రంగా చూస్తున్నారు ఆయన తన కెదురుగా కొద్దిదూరంలో నిలబడి వున్న ముగ్గురు పిల్లలవైపు బిళ్ళనుకొట్టాడు. అది ముచ్చటగా ఎగురుతూ పోయి ముందు నుంచునివున్న కుర్రవాడి చేతిలో పడింది. అంటే ఆయన 'ఛాన్సు' అయినట్టే అన్నమాట. పిల్లలందరూ ఇదిచూసి కేకలు పెట్టారు. ఆయన 'మరొక్కసారి వేస్తాను' అన్నాడు. మళ్ళీ ప్రయత్నం చెయ్యగా ఈసారి అది రెండవవాణ్ణి వరించింది. మళ్ళా పిల్లలు అరిచారు. ముసలాయన మొహాన అప్పటికే స్వేదబిందువులు అంకురించాయి. ఆయన మళ్లీ ప్రాధేయపడుతున్నట్టు "ముచ్చటగా మూడోసారి. ఇంక అడగనులే' అన్నాడు. వాళ్ళు 'సరే'నన్నారు. ఈసారి ఆయన జాగ్రత్తగా వాళ్ళకు అందే వీలులేకుండా బిళ్ళను నేలబారుగావేశాడు. వాళ్ళలో ఒకడు ముందుకు వచ్చి దాన్ని మళ్ళీ 'కంచా' దగ్గరికి విసిరాడు. అదృష్టవశాత్తూ అది కంచాకు దూరంగానే పడింది. దాన్ని ఆయన చేతిలోవున్న కర్రతో మూడుసార్లు కొట్టగలిగినంత దూరం కొట్టవచ్చు. ఆయన ఒకసారి బిళ్ళను పైకి లేపుదామని ప్రయత్నించాడు. కాని అది మాటవినలేదు. రెండోసారి కర్రతో చివరను తాకించేసరికి అది తప్పనిసరి అయినట్టు ఒక అడుగు ఎత్తునలేచింది. ఆయన చేతిలో వున్న కర్రను బలమంతా ఉపయోగించి విసిరాడు. బిళ్ళకు అది తగలనేలేదు. కాని ఆ వూపుతో ఆయన జబ్బ దగ్గర 'కలుక్కు'మని విపరీతమైన నొప్పిపుట్టింది. ఆయన జబ్బను ఎడమ చేత్తో పట్టుకుని బాధగా 'అబ్బా' అనుకున్నాడు. తర్వాత పిల్లలందరూ ఆశ్చర్యంగా చూస్తూ వుండగా, ఆ కుర్రవాడి చేతికి కర్రయిచ్చి తన చేతికర్ర అందుకుని "మీరాడుకోండి నాయనా!" అంటూ నెమ్మదిగా సాగిపోయాడు.

ముసలాయన ఈ స్మృతినుంచి తేరుకొనేసరికి హాల్లో లైట్లు వెలిగాయి. హాలు బయటవున్న కొద్దిమంది జనమూ నిరుత్సాహంగా లోపలికి వచ్చారు. వారి వాలకం చూస్తే కరెంటు రాకపోయినా, సినిమా చూడకపోయినా వారికేమీ పట్టినట్టులేదు. ఏదో డబ్బు పెట్టి వచ్చాం గనుక తప్పదులెమ్మన్నట్టు, కరెంటు రాగానే నిరుత్సాహంగా లోపలికి వచ్చారు. మధుకూడా వచ్చి 'తాతగారూ! ఇంతసేపూ బయటికన్నారాక, యీ చీకటిగుహలో ఎందుకున్నారండీ?" అంటూ కూర్చున్నాడు.

మళ్ళీ సినిమా ప్రారంభమైంది. మధు ఇంతసేపూ సణుగుతూనే వున్నాడు. "ప్రొద్దునలేచి ఎవరి మొహం చూడటంవల్ల యీ డొక్కు సినిమా చూడవలసి వచ్చిందో" అని చాలాసేపు ఆలోచించాడు. తర్వాత పూర్వపు వారి కలసు సినిమా తియ్యటం ఎలాగో చేతకాదు పొమ్మ'న్నాడు. 'ఆ నటీనటులందరిలోనూ కళాకాంతులనేవి ఏ కోశానాలేవు పొమ్మ'న్నాడు. 'ముఖ్యంగా ఆ హీరో వేసినవాడు కేవలం ఎద్దుమొద్దు స్వరూపంలా వున్నాడేతప్ప, ప్రేమపాట పాడుతున్నప్పుడు, ఆ మొహంలో 'రొమాన్సు' కాగడాపెట్టి వెతికినా కనిపించటం లేద'న్నాడు. ఇన్నీ అని చివరకు "ఇవాళ యీ సినిమా చూడటం పాతికయేళ్ళు వెనక్కు వెళ్ళటంవంటిది. మనం చేసుకున్న కర్మ" అని వూరుకున్నాడు.

ముసలాయన యిన్నీ వింటూనే సినిమాలో లీనమైపోయాడు. తర్వాత మరొక యిరవై నిముషాలు గడిచాక 'యింటర్వెల్' వచ్చింది. లైట్లు వెలిగాయి. మధు చాటుగా సిగరెట్టు కాల్చుకునేందుకు ఎత్తువేసి 'మీరిక్కడే కూర్చుని వుండండి తాతగారూ! హాలు బయట చలిగాలిలా వుంది మంచుకూడా కురుస్తున్నది. మీవంటికి మంచిదికాదు' అని

చెప్పి బయటికి వెళ్ళాడు. ముసలాయన కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ ఎందుకో కుడివైపు చూసి మళ్ళీ చూపులను మరల్చుకోలేకపోయాడు. ఆయనకు అయిదారు కుర్చీల అవతల ఒంటరిగా యిరవైయేళ్ళ వయసులో వున్న ఒక యువతి కూర్చునివుంది. పచ్చని శరీరమూ, తెల్లని చీరా, నెమలికంఠంరంగు జాకెట్టూ, జుట్టుముడి మీద అర్థచంద్రాకారంగా వున్న పూలూ... తాంబూలచర్వణంతో ఎర్రబడిన పెదవులూ... ముసలాయన మనసులో ఏదో గుబులు బయలుదేరింది. ఆయన ఏదో జ్ఞాపకం చేసుకునేందుకు ప్రయత్నించాడు. తానెప్పుడో యిదేరంగు చీరె, రవిక ధరించి యిదే విధంగా సిగ అలంకరించుకున్న స్త్రీని చూశాడు ఎప్పుడు?... ఒక్క క్షణంలో మెరుపుమెరిసినట్టయి ఆ వృత్తాంతమంతా జ్ఞాపకం వచ్చింది. 'అవును... యిదేరంగు రవిక, చీరె... యిదే అలంకరణ అనుకున్నాడాయన. వెంటనే ఆ ఉదంతమంతా సినిమారీలువలె మనోరంగంమీద నడిచింది.

దాదాపు మూడు సంవత్సరాల క్రిందట తనకు పిత్రార్జితమైన భూమి వున్న వూరికి వెళ్లవలసిచ్చింది. ప్రతి సంవత్సరమూ ఆ పనిమీద వెళ్ళే కుమారుడికి సెలవు దొరికే సూచనలు కనిపించలేదు. అప్పటికే ఆయనమీద అన్నీ ఆంక్షలు. డాక్టర్లు శరీర శ్రమ పనికిరాదన్నారు. చలిగాలిలో తిరగకూడదన్నారు. వర్షపు చినుకు వంటి మీద పడకూడదన్నారు. వంటికి సరిపడనివీ, త్వరగా జీర్ణంకానివీ, వేడిచేసేవీ, నెమ్ముచేసేవీ... ఏ వస్తువులూ తినకూడదన్నారు. మందు వేళ తప్పకుండా సేవించాలన్నారు. ఇన్ని ఇబ్బందులుండగా కోడలు, ఆయన ఇల్లు కదిలేందుకు వొప్పుకోలేదు. ఆయన కొడుక్కి సెలవు దొరక్కపోవటం నెపంగా తీసుకుని వాదించాడు... "ఎంత దూరమని... ఒక రోజు పని... నాకూ ఈ వయసులో వెడదామనిలేదు... అయినా అవసరంవచ్చినప్పుడు తప్పదుగా. కాస్తాకూస్తా కాదు. అయిదువందలు... నువ్వు ఒక నెక్లెసయినా చేయించుకోవచ్చు... వేళకు పోలేకపోతే రైతులు తర్వాత సమాధానం కూడా చెప్పరు. ఇప్పుడు వెళ్ళి కళ్ళంలో కూర్చుంటేగాని లాభంలేదు... నాకు విశ్రాంతిగా వుందామనేవుంది. అయినా ఇప్పుడు వాడికి సెలవు దొరక్కపోతే ఎలా చెయ్యటం" అని కోడలితో వాదించాడు. ఆయనకు లోలోపల, ఒక్క రోజయిన ఈ ఆంక్షలన్నిటిని తొలగించుకొని స్వేచ్ఛగా తిరిగి రావాలనే వుంది. ఆయన కుమారుడికి సెలవు దొరక్కుండా చెయ్యమని భగవంతుణ్ణి ప్రార్థించాడుకూడా. అలాగే అయింది. తర్వాత కోడలికి అవసరమైన హామీలన్నీ యిచ్చి, కొడుకు దగ్గర సలహాలు తీసుకొని ఆయన బయలు దేరాడు. ఆ వూరు స్టేషన్‌కు ఆరు మైళ్ళ దూరంలో వుంది. ఆయన రైలు దిగగానే ఒక బండి దొరికింది. ఆ వూరు వెళ్ళి రైతుల దెగ్గర డబ్బు వసూలు చేసుకొని ఆయన మళ్ళీ బయలు దేరిన సమయానికి రైతులు "మా బళ్ళన్నీ పనిమీద వుండిపోయాయి బాబుగారు" అన్నారు. ఆయన చప్పరించి ఆ మీ కెందుకోయ్ శ్రమ. ఆరు మైళ్ళ భాగ్యానికి బండి కావాలా? చిటికెలో నడిచిపోను?...అని బయలు దేరాడు. పొలాల పక్క రెండు గజాల వెడల్పున్న మట్టి బాట అది. బాట కిరు ప్రక్కలా రకరకాల చెట్లు నిలువెత్తున దడి కట్టినట్టు పెరిగి వున్నాయి. స్టేషన్ నుంచి వచ్చి పోయే బళ్ళన్నీ మెయిన్ రోడ్ మీదకే వస్తాయి. ఆ వూరి నుంచి దగ్గరలో వున్న ఇతర వూళ్ళకు పోవాలన్నా మెయిన్ రోడ్డే దగ్గరి త్రోవ. ఈచిన్న మట్టి బాట తను వచ్చే వూరి నుంచి స్టేషన్‌కు మాత్రమే చేరుస్తుంది. అందువల్ల జనసంచారం చాలా తక్కువగా వుంటుంది.ముసలాయనకు అక్కడ నడుస్తువుంటే చాలా హాయిగా

వుంది. ఆకాశం వింతవింత రంగులతో ముచ్చటగా వుంది. రెండు మూడు పక్షులు ఆకాశంలో తీరికగా ఎగురుతూ విన్యాసాలు చేస్తున్నాయి. ఒక మైలు దూరం నడవగానే ఆయనలో కొద్దిగా అలసట కనిపించింది. అయినా లెక్క చెయ్యకుండా చేతి కర్రను వూపుకుంటూ కూనిరాగంతీస్తూ నడకసాగించాడు. ఉన్నట్టుండి ఆయనకు తనముందు కొంత దూరంలో నడుస్తున్న ఒకామె కనుపించింది. ఆయనలో హుషారు హెచ్చింది. ఈలకూడా వేసుకుంటూ, ఆమెను కలుసుకోవాలని పట్టుదలతో త్వరత్వరగా నడవటం ప్రారంభించాడు. ఆమె వెనకనుంచి చూస్తే చాలా అందగత్తెవలె కనుపిస్తున్నది. తెల్లని చీరె, నెమలి కంఠం రంగు జాకెట్టు ధరించి తలలో అర్థచంద్రాకారంగా బంతిపూలు పెట్టుకుని, ముద్దబంతిపూవువంటి పద్దెనిమిదేళ్ళ ఆ ముద్దరాలు, పంచకళ్యాణి గుర్రంవలె ఠీవిగా నడుస్తున్నది. ముసలాయన ఆమెను కలుసుకోవాలని ఇంకా త్వరత్వరగా నడిచి, చివరకు ఆమెకు చేరువగా రాగలిగాడు. ఆమె తనకంటే ఒక అడుగుమాత్రమే ముందువుంది. ఆయనకు కొద్దిగా ఆయాసం వచ్చింది. అయినా లెక్కచెయ్యకుండా హుషారుగా నడుస్తున్నాడు. మనసులో 'పిల్ల ఎంత అద్భుతంగా వుంది! పిల్ల అంటే అలా వుండాలి. ఇంత వేడిగాలి కూడా ఆమె మీదినుంచి రావటంవల్లనేమో చల్లగా హాయిగా వుంది' అనుకున్నాడు... ఇంతలో ఒక విసురుగాలి చిలిపిగా వీచింది. ఆ గాలికి ఆమె పమిట కొంగు జారి పోయింది. ఆమె నడుస్తూనే సవరించుకుని ప్రక్కకుచూసింది. ఆయనలో రక్తం పరుగులు తీసింది. విశాలమైన కాటుకకళ్ళూ, వాడికత్తులవంటి చూపులూ ఆయనను రెచ్చగొట్టాయి. ఆయన, 'ఏదయినా చెట్టుచాటు చూసుకుని ఆ పిల్ల చెయ్యిపట్టుకోవాలి, కాస్త పెనుగులాడుతుంది అంతే... కాదనదు... అంతగా అయితే జేబులోవున్న డబ్బులో పదో, పాతికో ఎర చూపించవచ్చు' అనుకున్నాడు... కొద్దిసేపట్లో ఆయన కల వేయిరెట్లుగా ఫలించినట్టు ఒక పెద్ద మర్రిచెట్టు కొద్దిగజాల దూరంలో కనుపించింది. ఆయన రక్తనాళాల్లో రక్తం వెచ్చగా పరుగులు తీసింది. ఆయన మరికాస్త పక్కకు జరిగి ఆ పిల్లకు మరీ దగ్గరగా నడవటం ప్రారంభించాడు. ఆ చెట్టు దగ్గరపడుతున్నది. ఆయన మరికాస్త పక్కకు నడిచాడు. ఉన్నట్టుండి ఆ పిల్ల చెయ్యిపట్టుకుని ఆ చెట్టుచాటుకు లాక్కుపోవాలని ఆయన ఉద్దేశం. ఆ చెట్టు మరొక నాలుగైదు గజాలదూరంలోకి వచ్చింది. హఠాత్తుగా ఆ పిల్ల ఆయన వంకకు తిరిగి "తాతగారూ! మీ చేతికి గడియారం వున్నట్టుంది... టైమెంత అవుతుందండీ?" అని అడిగింది. ఆయన నీళ్ళుకారిపోయాడు... నడక వేగం మందగించింది... నెమ్మదిగా తన ముంజేతి మీద సిల్కులాల్చీ తప్పించి గడియారం వంక చూసి "అమ్మా! మూడుగంటలవుతున్నది తల్లీ!" అని సమాధానం చెప్పాడు. ఆ పిల్ల 'అమ్మో! చాలా ఆలస్యమైపోయింది!' అనుకుంటూ వడివడిగా నడిచి క్రమంగా కనుచూపుమేర దాటిపోయింది. ఆ మర్రిచెట్టు రానూ వచ్చింది. వెనుకబడిపోనూ పోయింది. ముసలాయన చేతికర్ర వూతగా నెమ్మదిగా నడిచాడు. ఆయన ఒక్క నిముషంలోనే నీరసించి పోయినట్టు కనిపించాడు. ఇంతదూరం నడవటంవల్ల కలిగే ఆయాసమూ, అలసటా కాళ్ళనొప్పులూ అన్నీ ఇప్పుడు ప్రారంభమైనాయి. ఆయన నెమ్మదిగా నడిచి స్టేషన్‌కు చేరుకునేసరికి పొద్దుగూకుతున్నది. మధ్యాహ్నం ఎప్పుడో రావలసిన రైలు ఆలస్యంగా వచ్చినందువల్ల ఆయనకు ఏ ఇబ్బందీ కలగలేదు.

మధు వచ్చి మళ్ళీ ప్రక్కన కూర్చుని 'తాతగారూ, మీరేదైనా డ్రింకుగానీ, కాఫీగాని

తీసుకుంటారా? తెచ్చి పెడతాను' అని అడుగుతూ వుండగా ఆయన ఆ స్మృతినుంచి తేరుకుని 'వద్దులే, నాయనా!' అన్నాడు.

మళ్లీ లైట్లు ఆరిపోయి సినిమా ప్రారంభమైంది. అక్కడక్కడ తెగిపోతూ నెమ్మదిగా, నిర్జీవంగా, కళావిహీనంగా సాగింది సినిమా. ఆయన కథలో లీనమై శ్రద్ధగా చూశాడు. మధు వుండి వుండి యింకా సణుగుతూనే ఉన్నాడు. హాల్లో ఉన్న కొద్దిమంది జనమూ శ్రద్ధాసక్తులు లేకుండా కూర్చున్నారు. ముసలాయనకు కుడివైపున అయిదారు కుర్చీల అవతల కూర్చునివున్న ఆ యువతిని ఒకడువచ్చి ఏదో మాట్లాడి వెంట తీసుకుపోయాడు. సినిమాలో పతాక సన్నివేశాన్ని ఆ రోజులలో లభ్యమైన హంగు లన్నిటితో చాలా జాగ్రత్తగా చిత్రీకరించారు. కథానాయకుడి తల్లి కుమారుడికోసం ఏడుస్తూవుండే దృశ్యమూ, రాజకుమారి ప్రియుడికోసం వియోగబాధతో పాటపాడే దృశ్యమూ, మాంత్రికుడు కథానాయకుణ్ణి నానాహింసలకూ గురిచేసే ఘట్టమూ, వెంట వెంటనే చిత్రీకరించారు. ఆ రోజుల్లో అది ఒక కొత్త పద్ధతి. మధు పతాక సన్నివేశం చూస్తూ కూడా తలపట్టుకుని 'అబ్బ! ఏమి సినిమారా బాబూ! అమృతాంజనం డబ్బా వెంట తెచ్చుకున్నా బాగుండిపోయేది' అన్నాడు.

కొద్ది నిముషాల తరువాత కథ సుఖాంతం అయింది. చివరి దృశ్యంలో రాజూ, రాణి, పశ్చాత్తాపం చెందిన రాణిగారి తమ్ముడూ, కథానాయకుడూ రాజకుమారీ, వరసగా నిలబడ్డారు తెరమీద 'శుభం' అని పడింది. లైట్లు వెలిగాయి. జనం నిశ్శబ్దంగా హాలు బయటికి నడిచారు. ఎవరైనా 'బాగుంది' లేకపోతే 'బాగులేదు' అని అంటారేమోనని ముసలాయన జాగ్రత్తగా గమనిస్తూ బయటికివచ్చాడు. కాని వారిలో ఒక్కరైనా సినిమా బాగోగులను గురించి పల్లెత్తు మాటాడకపోవడంతో ఆయనకు మరీ బాధ కలిగింది.

చల్లని గాలి వీస్తున్నది. ఆకాశంలో గచ్చకాయ రంగులో ఉన్న మేఘం చివర, మలినమైన గుడ్డలో కట్టబడిన ముత్యంవలె ఉన్నది చంద్రబింబం. హాలు బయట జనమేలేరు. యితర సినిమాలకు టిక్కెట్లు అందనివారు యిళ్ళకు పోయేందుకు యిష్టపడక, 'ఏదో ఒకటి చూద్దామ'ని ఆ హాలుకు వస్తారేమో! వొళ్ళమ్ముకునే ఒక ఆడది వీధిలైటు క్రింద క్రీనీడలో నిలబడి ఉండి, 'ఎవరైనా వస్తారేమోన'ని ఎదురుచూస్తున్నది.

ఇద్దరూ రిక్షా ఎక్కి బయలుదేరారు. ముసలాయన గంభీరంగా ఉన్నవాడల్లా ఒక్కసారి 'ఇదేమిట్రోయ్! ఇందాక మనం వచ్చినదోవ కాదే యిది?' అని అడిగాడు. మధు అది "అంతేనండి తాతగారూ! వన్ వే ట్రాఫిక్, బళ్ళూ, అవీ అటు పొయ్యేందుకు వీలులేదు. ఇటు వచ్చే వీలూ లేదు. ఏ దోవలోనూ ముందుకు పోవటమేతప్ప వెనక్కు వచ్చే వీలుండదు" అని సమాధానం చెప్పాడు.

ముసలాయన గంభీరంగా నవ్వుకుని 'అవును జీవితమూ అటువంటిదే. ముందుకు పోవటమేగాని వెనక్కు వచ్చే వీలులేదు. ముందుకు కదలటంకూడా మన చేతుల్లో లేదు.' అనుకున్నాడు. రిక్షా చల్లని గాలి తెరలను చీల్చుకుంటూ గుడ్డివెన్నెలలో వడివడిగా సాగిపోయింది.

1961, నవంబరు - భారతి ♦

♦♦♦